మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# అటవీ శాఖ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు: జిల్లా కలెక్టర్

**వనపర్తి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** అటవీ శాఖ గెజిట్, సెక్షన్ 4 ప్రకారం వనపర్తి జిల్లాలో అటవీ భూమిలో ప్రభుత్వం ద్వారా ఏమైనా అసైన్మెంట్ చేసి ఉంటే అట్టి భూమిని గుర్తించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ కమిటీ తో సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ గెజిట్ ప్రాకారం అదేవిధంగా సెక్షన్ 4 ప్రకారం గుర్తించిన అటవీ శాఖ భూమిలో ఇతరత్రా ఎలాంటి నిర్మాణాలు లేదా ఇతరులకు అప్పగించడానికి వీలు లేదని తెలిపారు. జిల్లాలోని అటవీ భూమిలో ఎక్కడైనా పొరపాటున అసైన్మెంట్ చేసి ఉంటే అట్టి భూమిని సర్వే నెంబరుతో సహా గుర్తించడానికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలో ఫారెస్ట్ అధికారితో పాటు ఆర్డీఓ, ఎడి సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత తహసిల్దార్‌తో కమిటి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అటవీ భూమిలో అసైన్మెంట్ చేసి ఉంటే గుర్తించి అట్టి పూర్తి వివరాలను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి జిల్లాలో సెక్షన్ 4 ప్రకారం ఉండాల్సిన అటవీ భూమిలో కొన్నచోట్ల తక్కువగా ఉందని, మరికొన్ని చోట్ల ఉండాల్సిన భూమి కంటే ఎక్కువ భూమి చూపిస్తున్నారని వీటిని సరి చేసి సర్వే ప్రకారం అటవీ శాఖకు ఉండాల్సిన భూమిని గుర్తించి ఇవ్వాల్సిందిగా కోరారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, ఎడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ బాలకృష్ణ, ఆర్అండ్‌బి నుండి డిఈ, సెక్షన్ సూపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# రేపు తుది ఓటరు జాబితా

## కలెక్టర్ విజయేందిర బోయి

## రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



యూరియా కోసం ఘనపురం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# యూరియా కోసం ధర్నా

## అధికార పార్టీ నాయకులు తరలించుకుంటున్నారంటూ ఆరోపణలు

**ఖిల్లాగణపురం సెప్టెంబర్ 8. ప్రభాతవార్త:** అధికార పార్టీకి చెందిన నాయకులు యూరియాను అక్రమంగా తరలించుకుంటూ నిరుపేదలైన సన్న,చిన్నకారు రైతులకు యూరియా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు స్వచ్ఛందంగా సోమవారం గణపురం మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో ధర్నా చేపట్టారు. రైతులు ఉదయమే యూరియా ఇస్తున్నారని స్థానిక రైతు వేదిక దగ్గర గుంపులు గుంపులుగా పోగయ్యారు. అక్కడ అధికారులు ఎవరు కనపడకపోవడంతో, మండల కేంద్రంలో వెంకటం పల్లి కమాన్ చౌరస్తాకు చేరుకుని ప్రధాన రహదారిపై యూరియా అందజేయాలంటూ నినాదాలు చేస్తూ గంటన్నరపాటు ధర్నా చేపట్టారు.యూరియా వస్తుందంటూ రైతులకు సమాచారం ఇస్తూ వచ్చిన యూరియాను మరుసటి రోజు ఇస్తామని టోకెన్లు రాసి పంపుతున్నారని రాత్రిపూట అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు వాళ్ళ గ్రామాలకు తరలించకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎసిఎస్ చైర్మన్‌తో పాటు సల్కలాపురం గ్రామానికి చెందిన డైరెక్టర్ ఒక్కో రైతుకు రెండు సంచులు అంటూ పంపిణీలో ముందు ఉంటూ యూరియా అయిపోయిందంటూ చేతులెత్తేస్తున్నారని మరి పది ఎకరాలకు పైగా సేద్యం చేసిన అధికార పార్టీ నాయకులు ఎవరు కూడా క్యూ లైన్‌లో కనపడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా రాగానే తమవారికి టోకెన్లు రాయించి అప్పుడే యూరియాను అందజేస్తున్నారని, తమ వారు కాని వారికి టోకెన్లు రాసి రెండు రోజుల తర్వాత రమ్మంటూ పంపించి వేశారని ఆవేదనను వ్యక్తం చేస్తూ ఇదేమి రాజ్యం దొంగల రాజ్యందోపిడి రాజ్యం అంటూ రైతులు నినాదాలు చేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారి మల్లయ్య,తహసిల్దార్ సుగుణ,డిప్యూటీ తహసిల్దార్ లక్ష్మీకాంత్, హెడ్ కానిస్టేబుల్ బొట్టు సీను రైతులకు నచ్చజెప్పి 6,7,8 తేదీలలో ఉన్న రైతులకు సాయంత్రం యూరియా అందజేస్తామని ఖచ్చితమైన హామీలు ఇవ్వడంతో రైతులందరూ సింగిల్విల్లో కార్యాలయం దగ్గరికి వెళ్లి వేచి ఉన్నారు. గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు దగ్గరుండి వాహనదారులను పంపించి వేశారు.

## నోటరీతో అసైన్డ్ భూముల

# విక్రయాలు..!



పభుత్వ భూమిలో కొలతల ప్రకారం ఏర్పాటు చేసుకున్న ప్లాటు రాళ్లు

- అనుమతులు లేకుండా ఇండ్ల నిర్మాణాలు..
- ఎమ్మెల్యే ఆదేశాలు భేఖాతరు...
- చోద్యం చూస్తున్న మండల అధికారులు



నిర్మాణాలు నిలిపివేయాలని నోటీసు జారీ చేసిన అధికారి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం నిషేధం. కానీ ప్రస్తుత పరిస్థితిలో ప్రభుత్వభూములు అడ్డదారిలో క్రయ విక్రయాలు చేయడం చాలా సులభతరమవుతుంది. ప్రభుత్వ భూములను నిరుపేద కుటుంబాలకు వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చుకోవాలనే సదుద్దేశ్యంతో కొంత మేర భూములను లావుని పట్టా రూపంలో పట్టాలు అందజేస్తుంది. అటువంటి భూముల్లో కేవలం సాగు చేసుకోవాలే తప్ప క్రయ విక్రయాలకు ఎలాంటి ఆస్కారం ఉండదు. ప్రభుత్వం పట్టాలు జారీ చేసే క్రమంలోనే ఇట్టి భూమి క్రయ విక్రయాలు చేయడం, నిర్మాణాలు చేపట్టి విక్రయంచడం నిషేధం లాంటివని సూచిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రభుత్వ భూముల్లో క్రయ విక్రయాలు జోరందుకుంది.

నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం, ఊర్కొండపేట గ్రామంలో సర్వే నెం.233/3లో అదే గ్రామానికి చెందిన ముచ్చర్ల రంగయ్య తండ్రి వెంకయ్యకు 1ఎకరం 05 గుంటల భూమిని కేటాయించింది. రంగయ్య ఆర్థిక అవసరాల నిమిత్తం చిక్కజంగమ్మ భర్త రాములుగారికి నోటరీ ద్వారా విక్రయించగా చిక్క జంగమ్మ స్థానికంగా బడా నేతలు, అదే గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిసహకారంతో పట్టాలో ఏకంగా పేరు మార్పిడి చేసుకుంది.కాలానుగుణంగా ఆ మహిళ సదరు ఓప్రభుత్వ ఉద్యోగి అండదండలు మరియు రాజకీయనాయకుల అండచూసుకొని ప్రభుత్వం, గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసు కోకుండా ప్లాట్లుగా చేసి యథేచ్ఛగా విక్రయాలు చేపట్టింది. ప్రభుత్వ భూములకు చట్టపరంగా రిజిస్ట్రేషన్ కావు కనుక నోటరీ బాండ్ల ద్వారా వారి పేరిట ప్లాటు నెంబరు మరియు గజాలు వేసి నోటరీ చేసి వారికి అట్టి ప్లాట్లపై హక్కులు కల్పించారు. కొనుగోలు చేసిన వ్యక్తులు సైతం గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ఇండ్ల నిర్మాణం చేపట్టారు. స్థానిక గ్రామ నాయకులు ప్రభుత్వ భూము లు అన్యాక్రాంతమవుతున్నా యనే విషయాన్ని గుర్తించి స్థానిక కార్యదర్శికి మరియు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు తూతూ మంత్రం గా తనిఖీలు నిర్వహించి వదిలేస్తున్నారు.

### నోటీసులు జారీ చేసి ప్రభుత్వ భూమిని జప్తు చేస్తాం...

ఊర్కొండపేట గ్రామ శివారులో సర్వే నెం.233/3లో గల 1 ఎకరం 05 గుంటల భూమిని వ్యవసాయ సాగు విస్తీర్ణం కోసం మాత్రం కేటాయించాం. ఇట్టి భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై గతంలోనే ఫాం-1, ఫాం-2 నోటీసులు జారీ చేశాం. నోటీసులు జారీ చేసిన కూడా నిర్మాణాలు నిలిపివేయకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఫాం-3 నోటీసు జారీ చేసి ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటాం.


*- తహసీల్దార్ యూసుఫ్ అలీ*

### పట్టాదారు ఖాతాలో రైతు బంధు...

రెవెన్యూ రికార్డులలో ప్రస్తుతం కూడా పట్టాదారుగా చిక్క జంగమ్మపేరిట గల 1 ఎకరం 05 గుంటల భూమి ఉండటం తో ప్రభుత్వం రైతులకు విడుదల చేస్తున్న రైతుబంధు డబ్బులు పట్టాదారు ఖాతాలో జమ అవుతున్నాయి. పట్టాదారు మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు చేసి విక్రయాలు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతుంది. ప్రభుత్వం నుంచి వచ్చే రైతు బంధు డబ్బు లు మాత్రం యేటా 2సార్లు తీసుకోవడం గమనార్హం. సదరు భూమికి అనుకొని బీసీ బాలుర వసతి గృహం కలదు. అట్టి వసతి గృహానికి వెళ్లే దారి సైతం కబ్జాకు గురైనట్లు గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపిస్తున్నా రు. అధికారులు నోటీసులు జారీ చేసిన క్రమంలో నిర్మాణాలు కొద్ది కాలం నిలిపి అధికారుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేకపోవడంతో నిర్మాణాలు సైతం పూర్తి చేసుకున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించడం, స్థానిక ప్రభుత్వ ఉద్యోగి సదరు అధికారులతో మాటా మంతి చేసుకొని తనిఖీల వ్యవహారం మమ అన్నట్లుగా చేస్తున్నారు.

### అధికారులు నోటీసులకు చిల్లు...

గతంలో గ్రామస్తులు ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందనే విషయాన్ని స్థానిక తహసీల్దార్‌కు వివరించడంతో స్థానిక తహసీల్దార్ విచారణ చేపట్టి అక్రమంగా ఇండ్ల నిర్మాణం చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. నోటీసులు తీసుకున్న వారు మాత్రం అధికారుల నోటీసులకు ఎలాంటి సమాధానమివ్వకుండా మిన్నకుండిపోతున్నారు. అధికారులు జారీ చేసిన నోటీసులకు ఎలాంటి స్పందన లేకపోయిన అధికారులు మాత్రం -మిగతా4లో..



స్థానిక పట్టాదారుకు అధికారులు అందించిన నోటీసు

# పెబ్బేరు మండలం అభివృద్ధికి పూర్తి సహకారం

## నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**పెబ్బేరు సెప్టెంబర్ 8 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని గ్రామాలలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం రోజు ఎమ్మెల్యే మెఘా రెడ్డి పాల్గొని ప్రారంభించారు. కంచిరావు పల్లి తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు.తండాలోని ఆలయ నిర్మాణానికి ఆయన తన సొంత నిధులు రూ. 2లక్షలను విరాళంగా అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తండాకు బీటి రోడ్డు నిర్మాణం గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఆలయనిర్మాణంతోపాటు ప్రభుత్వ పథకాల భాగంగా రేషన్ కార్డులు రేషన్ బియ్యం ఇందిరమ్మ ఇండ్ల లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టేమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పెబ్బేరు మండల కేంద్రంలోనీ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.45లక్షలఖర్చుతో తరగతి గదుల బలోపేతంతో పాటు డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు.అనంతరం పెబ్బేరు మండలపరిషత్‌ఆవరణలో ప్లాస్టిక్ వేస్టేజ్ వేరియేషన్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ మోడల్‌హౌస్‌లను నిర్మించిన 5మంది భవన నిర్మాణ కార్మికుల దంపతులకు శాలువాలతో సన్మాని నూతన వస్త్రాలను అందజేసి సత్కరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించి దన్నారు.వనపర్తి నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం రూ.650కోట్ల ఖర్చు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.పాత సుగూరు గ్రామంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించి ఉన్నత పాఠశాలను సందర్శించారు.పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొత్త సూగూరు గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించి.కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మెను ఆవిష్కరించారు.అనంతరం పెంచికలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.గ్రామంలో నూతనంగా నిర్మించిన కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మెను ఆవిష్కరించారుఅనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వనపర్తి నియోజకవర్గంలో నేటికీ 1759 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.విద్య వైద్యంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు రేషన్ బియ్యం లాంటి పథకాలు రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో వనపర్తి హౌసింగ్ డిఇ విటోబా,ఎంపీడీవో రోజా రెడ్డి,పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు,నాయకులు రంజిత్ కుమార్,సురేందర్ గౌడ్,దయాకర్ రెడ్డి, శ్రీరంగాపురం మండల నాయకులు శ్రీహరి రాజు,బీరం రాజశేఖర్ రెడ్డి,యాపార్ల రామ్ రెడ్డి,వెంకటరమణ,వెంకటేష్ సాగర్,సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు,పట్టణ మాజీ కౌన్సిలర్, అధికారులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సుగురు జిల్లా పరిషత్ స్కూల్‌ను సందర్శించిన ఎమ్మెల్యేను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

## కేటీఆర్ మీటింగ్ సభా స్థలాన్ని

# పరిశీలించిన మాజీ మంత్రులు

**గద్వాల టౌన్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** ఈనెల 13వ తేదీన బిఆర్ యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గద్వాల పర్యటన సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండ్ నందు సభ స్థలాన్ని పరిశీ లించారు. గద్వాలలో జరగనున్న కేటీఆర్ సమావేశ ఏర్పాట్ల పనుల ను సోమవారం మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ,శ్రీనివాస్ గౌడ్ ,అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ,మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్ ,గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు పరిశీలించారు. ఈ సమావేశంలో కేటీఆర్ సమక్షంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ బీఎస్ కేశవ్‌తో పాటు కొందరు మాజీ కౌన్సిలర్లు, మరికొంతమంది కాంగ్రెస్ నాయకులు బిఆర్‌యస్‌పార్టీలో చేరుతున్నారు. ఈ సమావేశానికి బిఆర్ యస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



పాత బస్టాండులో సభ స్థలిని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు

# ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

**గద్వాల టౌన్ సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు,అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లల మృతి

**ఊట్కూర్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని సమిస్తాపూర్ గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుక్కల దాడికి గురై 25 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. కొల్లూరు గ్రామానికి చెందిన పెద్ద బీరప్ప తన గొర్రెల మందలోని చిన్న గొర్రె పిల్లలను ఇనుపకంచెలో ఉంచి, చుట్టూ ముళ్ళ పొద కట్టాడు. ఆ సమయంలో పెద్ద గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. అయితే కాపరులు ఎవరూ అక్కడ లేని పరిస్థితిని గమనించిన కుక్కలు తెలివిగా కంచె దిగువన గోతి తవ్వి లోనికి ప్రవేశించి, గొర్రె పిల్లలపై దాడి చేసి ఒకేసారి 25ని చంపేశాయి.ఈ దారుణ ఘటనతో బీరప్ప కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. పెద్ద సంఖ్యలో గొర్రె పిల్లలు చనిపోవడంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబం వాపోయింది.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

# విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

**గద్వాలటౌన్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** విద్యార్థులకు మార్గదర్శకులు గురువులేనని, సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన హాల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో భాగంగా డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. కలెక్టర్ తన విద్యాభ్యాసాన్ని గుర్తుచేసుకుంటూ, ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ,విలువలే తన విజయానికి పునాది కాగా,అవే ఐఏఎస్ స్థాయికి తీసుకువచ్చాయని, ఆ విలువలను ఇప్పటికీ ప్రతిరోజూ తన జీవితంలో పాటిస్తున్నానని అన్నారు. జిల్లాలో పదవ తరగతి-2025 ఫలితాల్లో రాష్ట్రంలో 32వ స్థానం నుండి 26వ స్థానానికి చేరి 10.36 వృద్ధి సాధించిందని,ఈ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, మరింత నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి వారం రెండు పాఠశాలలను సందర్శిస్తున్నట్లు తెలిపారు.



ఉపాధ్యాయరాలుని సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

### విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరం...

గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల కృషి వల్ల విద్యార్థులు మెరుగైన విద్యతో పాటు క్రమశిక్షణలో అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ప్రపంచ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల జీవితాల్లో వారు బోధించే ప్రతి విద్య విలువ అత్యంత ముఖ్యమని అన్నారు. గట్టు మండలం భారతదేశంలో వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటి అయితే,ఈ రోజు అక్షరాస్యత మెరుగుపడుతూ ముందుకు వెళ్తుందని తెలిపారు. మట్టిలో మాణిక్యం ఉన్నట్టే, గ్రామీణ ప్రాంతంలోని ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసి ఉత్తమ స్థాయికి తీసుకువచ్చారని అన్నారు. తోడ్పాటు అగురువులు సమాజానికి అవసరమయ్యే భావిభారత పౌరులను తీర్చిదిద్దే విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి చేయాలన్నారు.గద్వాల్ జిల్లాలో 55 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడానికి కృషి చేసిన 10 పాఠశాలల ఉపాధ్యాయులకు కలెక్టర్,గద్వాల్ శాసనసభ్యులు వారికి ప్రశంస పత్రం, మేమెంటో, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వయోజనవిద్యా శాఖ మార్గదర్శిని పుస్తకం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని, మండల విద్యాశాఖ అధికారులు , ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టిన వికలాంగులు

## కలెక్టరేట్ ఎదుట

# వికలాంగుల గర్జన

- పెన్షన్లు పెంచాలని కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా
- కలెక్టర్ విజయేంద్రబోయికి వినతిపత్రం సమర్పణ

**భూత్పూర్,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ఎన్నికల ముందు వికలాంగుల పెన్షన్ల కోసం విడుదల చేసిన మ్యానిఫెస్టోను అమలు చేయాలని,వికలాంగుల పెన్షన్ రు.6000లు,చేయూత పెన్షన్ రు.4000లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగులు సోమవారం పాల్‌కొండ శివారులోని నూతన కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.హామీలిచ్చి అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని వికలాంగులు డిమాండ్ చేస్తూ ధర్నా, ఆందోళన -మిగతా4లో..

### నాగురావ్ నామజీకి మహ్మద్

## ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకం అందజేత

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** జమతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర బిజెపి నాయకులు నాగురావ్ నామాజీకి స్వగృహంలో మహమ్మద్ ప్రవక్త జీవి త చరిత్ర పుస్తకంతో పాటు మిఠాయిలను అం దించారు. ఈ సందర్భంగా నాగురావ్ మాట్లాడు తూ ప్రేమ సద్భావన శాంతి అన్ని మతాల సా రం ఒక్కటే అని సోదభావంతో మెలగాలని అన్నా రు. పట్టణంలో 250మంది ప్రముఖులకు మహ్మ ద్ ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకాలతోపాటు మితా యిలను పంపిణి చేసినట్లు జమతే ఇస్లామి హింద్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమతే ఇస్లామి పట్టణ అధ్యక్షులు హర్షద్ ఫైసల్,మాజీ అధ్యక్షులు ముజాహిద్ సిద్ధిఖి, జహిర్ సోఫీ, అన్వార్ పాషాతో పాటు తదితరులు ఉన్నారు.

## మైసమ్మ ఆలయంలో లడ్డు, పులిహోర విక్రయ వేలం

### 20 లక్షల 44 వేలకు దక్కించుకున్న కంఠం నరేష్

**నవాబ్‌పేట,సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** తినుబండరాలు లడ్డు, పులిహోర ప్రసాదముల విక్రయా నికి పర్వతాపూర్ మైసమ్మ దేవస్థానంలో సోమవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో, బహిరంగ వేలము నిర్వహించారు.బహిరంగ వేలంలో హోరాహోరీగా సాగినవేలం పాటలో కాకర్లపాడుకు చెందిన కం ఠం నరేష్ తండ్రిఆంజనేయులు 20 లక్షల 44 వేల రూపాయలకు వేలం దక్కి చుకున్నాడు. గత సంవత్సరం కంటే ఈసంవత్సరం 2లక్షల 43000 అధికంగా వేలం పాట పాడారు.బహిరంగ వేలంలో జిల్లాదేవాదాయశాఖ డిజన్ ఇన్స్పెక్టర్ నినాదరి,ఆలయ కార్యనిర్వహణ అధికారి నర్సింలు, ఆలయ చైర్మన్ టి. జగన్మోహన్ రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ గోపాల్, కృష్ణయ్య, రికార్డ్ అసిస్టెంట్ గోపాల్, ధర్మకర్తల మండలి సభ్యులు గ్రామ ప్రజా ప్రతినిధులు సుభాన్, ఎండి మైనుద్దీన్, తాండెం రాజు, బక్క బాలయ్య, కట్ట మల్లేష్, టి.నరేందర్, పాశం నరేందర్, నారాయణరెడ్డి, కట్ట ఈరన్న, ఆంజనేయులు, తాడేం పుల్లన్న, అంకం ఆంజనేయులు, కంఠం నరేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యాలపై తల్లిదండ్రుల సమీక్ష

**ఊట్కూర్,సెప్టెంబరు8 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో ఆదివారం తల్లిదండ్రుల సమావే శం జరగగా, విద్యార్థుల సౌకర్యాలపై సమీక్ష సాగింది. ఈ సమావేశానికి హాస్టల్ వార్డెన్ వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులం దరికీ అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను సమయానికి అందిస్తున్నామని, ముఖ్యంగా పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రాబోయే పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సమావేశానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ హాస్టల్ సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ, విద్యార్థులు సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సమావేశ కన్వీనర్ మురళి, సిపియస్ హెడ్‌మాస్టర్ గురు నాథ్, జిపియస్ ఉపాధ్యాయుడు నర్సింహులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

## స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి: ఎంపీఓ

**ఆత్మకూర్ సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అన్నిరాజకీయ పార్టీలనాయకులు అధికారులకు సహకరించాలని ఆత్మ కూరు ఎంపీఓ శ్రీరామ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.స్థానిక ఎన్నికలకు సంబంధించి సోమవారం రోజు పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయంలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఈ మేరకు గాను ఎంపీటీసీ, జెడ్పిటిసి ఓటర్ల తుది జాబితా విడుదల చేయడం జరిగిందని అభ్యంతరాలు ఉన్న పక్షంలో అధికారులకు తక్షణమే తెలియజేసేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ బిఆర్ఎస్, అశోక్ భూపాల్ యాదవ్, తిరుపతయ్య గౌడ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## జిపిఓలుగా నియామకమైన అభ్యర్థుల క్షీరాభిషేకం

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం జిపీఓలుగా నియామకం చేసినం దుకు గాను మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరియు స్థానిక మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. గత ప్రభుత్వం విఆర్ఓ వ్యవస్థను రద్దు చేసిన తర్వాత గ్రామస్థాయిలో ఉన్న విఆర్ఏలను వివిధ శాఖల్లో భర్తీ చేసి వారు విధులు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మళ్లీ విఆర్ఓ స్థానంలో గ్రామ పాలన అధికారులుగా ఇచ్చినందుకు ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు మాకు న్యాయం జరిగిందనే సంతోషంతో మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలలో పనిచేస్తున్న వీఆర్ఏలు, మచ్చేంద్ర, సునీత, మాధవి, మహదేవ్,అనంతలక్ష్మి ్మ, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలు సజావుగా జరగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

**అమరచింత సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టను న్న స్థానిక ఎన్నికలను సజావుగా జరగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని అమర చింత మండల ఎంపీఓ నరసింహయ్య కోరా రు. సోమవారం అమరచింత మండల ఎంపీ డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వ హించనున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు నిర్వహణకు సిద్ధమవుతున్నామని మండలంలోని ఐదు ఎంపిటిసి స్థానాలు ఉన్నాయని ఆయన తెలిపారు. అలాగే మండలంలోని పురుషుల ఓట్లు 6,855, మహిళలు7,041 తోపాటు మొత్తం ఓటర్లు 13,896 ఉన్నారని ఆయన తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఓటర్ లిస్టులో సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం

## ఘనంగా మిలాద్ ఉన్ నబి ర్యాలీ

### ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

**నారాయణపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం మిలాద్ ఉన్ నబి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మెయిన్ చౌక్ వద్ద జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పాల్గొని ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబి పండుగ శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. హిందూ ముస్లింలు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ఐక్యత స్నేహభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 5న మిలాద్‌ఉన్ నబి గణేష్ నిమజ్జనం ఒకే రోజు రావడంతో ముస్లిం సోదరులు ఔదార్యాన్ని చాటుతూ ర్యాలీని 8వ తేదీకి వాయిదా వేయడం ప్రశంసనీయమని అభినందించారు. ఇలాంటి పండుగల్లో పాల్గొనడం నాకు ఆనందంగా ఉంది అని ఎస్పీ తెలిపారు. ర్యాలీ మార్గమంతా పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీఎం డిరియాజ్ హూల్ హక్,డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సీఐ శివ శంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, నరేష్, సునీత, గాయత్రి, కృష్ణ చైతన్య తదితర పోలీసు అధికారులు హిందూ ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయలకు ఘన సన్మానం

**ఊట్కూర్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల వనరుల కేంద్రంలో జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మా నం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని అవార్డు గ్రహీత లకు అభినందనలు తెలిపారు.జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలుగా అనురాధ, నారాయ ణ, రమేష్, నాగేందర్ లోప్టే, మొహ్మద్ గౌస్, ప్రభా ఎంపికయ్యారు. అలాగే మండల స్థాయి అవార్డులను జ్ఞానేశ్వరి, బస్నేశ్, పృధ్వీరాజ్, శిరీష, సుజాత, కల్పనా, విక్టర్ పాల్, బ్రహ్మారాంబ, శశిరేఖ, మునీరుద్దీన్ అందుకున్నారు.ఈ సందర్భంగా లీనిపీ మాధవి గారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవనీయమైనది, విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ ఈ గుర్తింపు తమకే కాకుండా మొత్తం ఉపాధ్యాయ సమాజానికే దక్కిందని, భవిష్యత్‌లో విద్యార్థుల ప్రగతి కోసం మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుసుమ, సత్యనారాయణ, కృష్ణ, గోపాల్, నర్సింగప్ప, గోవర్ధన్, నరసింహారెడ్డి, భాస్కర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

### వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ

# ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి

ఏఐపికేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఏ సలీం, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్





ధర్నా నిర్వహిస్తున్న ఏఐపికేఎంఎస్ నాయకులు

**నారాయణపేటటౌన్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి రూ. 12,000లు వెంటనే ఇవ్వాలనీ ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఏ.సలీం,జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26, 2025న ఆత్మీయ భరోసాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రెండు దఫాలుగా 6000 ఖరీఫ్ సీజన్ వారిగా ఇస్తామన్నారు. వ్యవసాయ కూలీలకు ఎన్ఆర్ఈజీఎస్ అని అనుబంధాలను వర్తింప చేయరాదు. వ్యవసాయ కూలీలందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి అన్నారు. రాష్ట్రంలో 1 ఎకరంలోపు 24.22 లక్షల మంది రెండు ఎకరాలు వరకు ఉన్న 17.2 లక్షల మంది కూలీలు ఏడాది పొడవున కూలిపైన ఆధారపడి, జీవనం బ్రతకడానికి వేరే ఆదాయ పనులు లేవు బ్రతుకు లీడుస్తున్నారు. వ్యవసాయ కూలీలకు పథకం వర్తింపజేయాలి. ఇందిరమ్మ ఆత్మీయభరోసా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 13 మండలాలలో 8189 మందిని అర్హులని గుర్తించి, 4746 మందిని వివిధ కారణాలవల్ల తొలగించారు. 3445 మందిని అరువులుగా గుర్తించి రూ.6000లు మాత్రమే చెల్లించారు. రెండవ దఫా చెల్లించలేదు.వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరాములు, చెన్నప్ప, వై. రాజు, సాయిలు, వెంకటయ్య, చెన్నప్ప, రామాంజనేయులుతో బాటు తదితరులు పాల్గొన్నారు.

## మాలలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**అలంపూర్ సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :** తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పిల్లిసుధాకర్ పిలుపుమేరకు అలంపూర్‌నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ని ముట్టడించి అనంతరం ఎమ్మెల్యే విజయుడుకి వినతి పత్రం ఇవ్వడం జరిగినది.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం దగ్గర జీవో నెంబర్ 99ను దగ్ధం చేయడం జరిగిందని మాల మహానాడు తాలూకా ఇన్చార్జ్ రజినిబాబు,మరియు మాల మహానాడు జాతీయ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల రవికుమార్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితుల ఆశాజ్యోతి, దళితుల ఐక్యత మరియు ఔన్నత్యానికి కృషిచేసిన "బాబాసాహెబ్" డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్ జన్మదినరోజునే మనజాతికి,దళితుల ఐక్యతకు ఎంతో అన్యాయం చేసే, ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని, ఈతెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు.అందులో ముఖ్యంగా మన మాలజాతికి కేవలం 5శాతమే రిజర్వేషన్ ఇచ్చి ఎంతో అన్యాయానికి గురి చేసింది. అంతకన్నా దారుణమైన విషయమేమనగా రోస్టర్ పాయింట్, జీవో 99 ప్రకారం మనకు రోస్టర్ పాయింట్ 22 ఇవ్వడం అనేది ఇది కేవలం మాల జాతిని అణిచివేయాలని ఆలోచనతో చేసిన కుట్ర మాత్రమే అని తెలిపారు.ఈ విషయంపై తెలంగాణ అసెంబ్లీలో మరి ఒకసారిచర్చ జరపవలసిందిగా కోరమన్నారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు తాలూకా ఇన్చార్జ్ రజినిబాబు,జాతీయ మాలమానాడు రాష్ట్రకార్యదర్శి తుమ్మల రవికుమార్ రాష్ట్ర కార్యదర్శి, భాస్కర్, నాగరాజు, ఎర్రన్న, వెంకటేశ్వర్లు, విజయ్, పరశురాముడు, ముంత నాగరాజు,ఆనంద్ బాబు, భరత్, ప్రశాంత్,బన్నీ, మనోహర్, హరి,తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న మాల మహానాడు నాయకులు

## ఓటర్ తుది జాబితా సెప్టెంబర్ 10న విడుదల

**నారాయణపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో జెడ్పీటీసీ,ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న విడుదల చేయనున్నట్లు అదనపు కలెక్టర్ ఎస్.శ్రీను తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ముసాయిదా జాబితాపై అభ్యం తరాలు ఉంటే వాటిని తెలియజేయాలని, అందిన అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితా రూపొందించామని తెలిపారు. మండల స్థాయిలో కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు జరిపి సూచనలు స్వీకరించినట్లు ఆయన వివరించారు. తుది ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు . ఈ సమావేశంలో డిఆర్డిఓ మొగులప్ప కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సలీం, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిబన్న, బిఆర్ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, సిపిఎం నాయకులు వెంకట్రాంరెడ్డి, డీఎస్పీ నాయకులు బొదిగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎస్.శ్రీను

## ఓటర్ జాబితా అవగాహనపై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం

**వీపనగండ్ల సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు అయినా జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం సమయం అవుతూ వివిధ రాజకీయ పార్టీలను కూడా సమాయత్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశానుసారం వీపనగండ్ల మండల కేంద్రంలో సోమవారం నాడు ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీలతో ఓటర్ జాబితా భూ సాయిధ పై సమీక్ష సమావేశం ఎంపీడీవో శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైనటువంటి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ గోదల బీరయ్య యాదవ్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దొడ్ల బాల్ రెడ్డి బిఆర్ఎస్పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ గౌడ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల నిర్వహణ కోసం ఇటీవల ఎన్నికల సంఘం ఇచ్చినటువంటి ఆదేశానుసారం వివిధ పార్టీలను ఎన్నికల ముసాయిదా ప్రకరణలపై సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన ఈ సందర్భంగా రాజకీయ పార్టీలను కోరారు మొత్తం పోలింగ్ కేంద్రాలు 39 ఉండగా ఎంపీటీసీలు 8 జడ్పిటిసి ఒకటి ఉన్నాయి వీటికి ఎన్నికల నిర్వహణ జరుగుతుందని ఆయన తెలిపారు అదేవిధంగా మండల మొత్తంలో ఓటర్లు 23,681 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు ఇందులో స్త్రీలు 11773పురుషులు 11907ఉన్నట్లు ఆయన తెలిపారు అదరు ఒకటి ఉన్నారు కాగా మొత్తం వీపనగండ్ల మండలంలో గ్రామపంచాయతీలు 14 ఉన్నట్లు ఆయన తెలిపారు,

## జీఎస్టీ ధరలు తగ్గింపుపై బీజేపీ శ్రేణుల హర్షం

**ఊట్కూర్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల కేంద్రంలోని ఈశ్వర్ మందిరం వద్ద బీజేపీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ ధరలు తగ్గించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రతి వర్గానికీ ఊరట కలిగించేదిగా ఉందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో తీసుకున్న ఈ నిర్ణయం ఆర్థికంగా ప్రజలకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. జీవిత బీమా ప్రీమియంలపై ఇప్పటివరకు 18 జీఎస్టీ అమలులో ఉండగా, ఇకపై ఎటువంటి పన్నులు లేకుండా ప్రీమియం చెల్లించవచ్చని చెప్పారు...వ్యవసాయ పరికరాలపై ఉన్న 18 జీఎస్టీని 5 కు తగ్గించడం రైతులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని వివరించారు. నిత్యావసర వస్తువులపై, కార్లపై కూడా జీఎస్టీ తగ్గించడం వల్ల సామాన్య ప్రజలు లబ్ధి పొందుతారని తెలిపారు.భాస్కర్ మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల సమస్యలను అర్థం చేసుకొని, అన్ని వర్గాలపై ఉన్న పన్ను భారాన్ని తగ్గించే నిర్ణయం తీసుకోవడం అభినందనీయం" అని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిటిసి హనుమంతు, జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి గోపాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, సీనియర్ నాయకులు ఆశప్ప, రఘువీర్, మాజీ మండల అధ్యక్షులు రమేష్, రణవీర్, మాజీ ఎంపిటిసి శివప్ప, బీజేవైఎం రమేష్, బూత్ అధ్యక్షులు శివకుమార్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని జీఎస్టీ తగ్గింపుపై ఆనందం వ్యక్తం చేశారు.

## ఉపాధ్యాయ వృత్యంతరాభివృద్ధి కోసం ప్రత్యేక గుర్తింపు

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** దేశ రాజధాని న్యూ ఢిల్లీలో ఈ నెల 10 నుండి 24 వరకు జరిగే 15 రోజుల శిక్షణ కు ఎంపి ఉపాధ్యాయుల వృత్యంతరాభివృద్ధి లో భాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్‌లో నిర్వహించబోయే 15 రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్ర మం కోసం తెలంగాణ రాష్ట్రం నుండి పది మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఎంపిక అయ్యారు. ఎంపికైన ఉపాధ్యాయు లందరికీ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ సన్మానం చేశారు. ఇందు లో నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మక్తల్ మున్సిపల్ కార్యాలం వద్ద ఉన్న పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆర్.కె.అశోక్ కుమార్ ఎంపిక కావడం గర్వకారణమని తెలియజేశారు. ఈ శిక్షణ కార్య క్రమం జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి2020), పప్పెట్రీ ఆధారి త బోధన పద్ధతులు, సృజనాత్మక ఆవిష్కరణలు, శిక్షణా సాంకేతి కతల సమర్థ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేకంగా కేంద్రీకృ తమవుతుంది. దేశవ్యాప్తంగా ఉత్తమ బోధనా పద్ధతులు ఆచరిస్తు న్న ఉపాధ్యాయులను మాత్రమే ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చే ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి ప్రాతి నిధ్యం లభించడం జిల్లా మొత్తానికి ఒక గర్వకారణమని కలెక్ట్ తెలియజేశారు. ఆర్. కె. అశోక్ కుమార్ ఈ సంవత్సరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గెలుపొందడంతో పాటు జాతీయ స్థాయి శిక్షణ ఎంపికపై జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అకాడెమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ విద్యాసాగర్, మండల విద్యాధికారి శ్రీ అనిల్ గౌడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కె.అశోక్ కుమార్ మాట్లాడుతూఈ అరుదైన అవకాశం నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, తెలంగాణ రాష్ట్రం, నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణానికి గొప్ప గుర్తింపువిద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి, నూతన బోధనా విధానాలు నేర్చుకొని తరగతి గదిలో అమలు చేయడానికి కృషి చేస్తానన్నారు .ఈ గౌరవం నాకు లభించడానికి సహచర ఉపాధ్యాయులు, ఉన్నతాధికారుల మార్గదర్శకత్వం, ప్రోత్సాహం, నా విద్యార్థుల కృషి కారణమని భావిస్తున్నానని తెలిపారు.మక్తల్ పట్టణంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, స్థానిక ప్రజలు కూడా ఆర్.కె.అశోక్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలుపుతూ ఈ ఎంపిక మక్తల్ విద్యా రంగానికి ఒక ప్రత్యేక గుర్తింపు, ప్రేరణ అని అభిప్రాయపడ్డారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం





విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

## విద్యార్థుల మధ్య మాదిరి ఎన్నికల ఉత్సాహం

**ఊట్కూర్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** ఊట్కూర్ పరిధిలోని మొగ్ధంపుర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో మాదిరి ఎన్నికలు (మాక్ పోలింగ్) ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో భూమిక, శివాని, శివశంకర్ అభ్యర్థులుగా పోటీ చేయగా విద్యార్థులంతా తమ ఓటు హక్కును వినియోగించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక లెక్కింపు జరిపి, శివశంకర్ విజేతగా నిలిచాడు. ఈ మాదిరి ఎన్నికల ద్వారా విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడమే లక్ష్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, నర్మద, అపర్ణ, శ్రీదేవి, అమ్మ, ఆదర్శ పాల్గొన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ సత్యమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరై పిల్లలను ప్రోత్సహించారు.



పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

## పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

**దామరగిద్ద, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం నిత్యవసర ధరల పై జిఎస్టి శాతాన్ని భారీగా కుదించడాన్ని హర్షిస్తూ నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి మండల అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, జిల్లా రాష్ట్ర గ్రామ కార్యకర్తలతో క్షీరాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటయ్య,గోపాల్ రావు, ఎంపీటీసీ అంజిలప్ప వెంకట్రాములు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



ప్రిన్సిపల్‌కు వినతి పత్రం సమర్పిసునతన్న దృశ్యం

## వేతనాలు వెంటనే చెల్లించాలి

**నారాయణపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణ పేట పట్టణ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో పార్ట్ టైం ఉపాధ్యాయులు మరియు ఆట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు లేక కుటుంబ పోషణ ఇబ్బంది ఏర్పడిందని రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని రకాల విధులు నిర్వర్తించినప్పటికీ జీతాల విషయంలో మాత్రం అలసత్వం తీరని అన్యాయం అన్ని విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటి నుంచి ప్రతి నెల 5 తారీకు వరకు జీతం చెల్లించేలా చూడాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించి తగిన చర్యలు తీసుకొని జీతాలు అందేలా చూడాలని తెలిపారు.

## కురువ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** మండలంలోని లాల్ కోట గ్రామంలో జరుగుతున్న శ్రీ ఆంజనేయ, ఈశ్వర, వెంకటేశ్వర ఉత్సవాలకు తరలివచ్చిన భక్త జనానికి శ్రీ మల్లికార్జున కురువ సంఘంఆధ్వర్యంలో భక్తులకు ఉచితఅన్నదానాన్ని నిర్వహించారు.గత రెండు సంవత్సరాలుగా ఉత్సవాల సందర్భంగా శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ఉచిత అన్నదానాన్ని ఏర్పాటుచేస్తున్నామని,ఈఏటా ఉత్సవాల సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామిదేవాలయంలో సోమవారం మధ్యాహ్నంనుంచి రాత్రి వరకు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చే భక్త జనానికి ఉచితంగా అన్నదానం చేశామన్నారు. శ్రీ మల్లికార్జున కురవ సంఘం సభ్యులతోపాటు గ్రామస్తులను శ్రీ దేవత మూర్తులు చల్లగా చూడాలని వేడుకున్నట్లు కురువ సంఘం సభ్యులు తెలిపారు.

## జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికలపై అన్ని పార్టీల సమావేశం

**ఊట్కూర్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** ఉట్కూర్ మండల ఎంపిపి కార్యాలయంలో జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికల-2025కు సంబంధించి అన్ని పార్టీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ప్రాథమిక ఓటర్ల జాబితా, ప్రాథమిక పోలింగ్ కేంద్రాలపై వచ్చిన అభ్యంతరాలపై విస్తృత చర్చలు జరిగాయి. మండలంలోని అన్ని రాజకీయపార్టీల నాయకులు హాజరై తమ సూచనలు, అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అధికారులు పార్టీ ప్రతినిధుల అభ్యంతరాలను నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ ధనుంజయ గౌడ్ పాల్గొని కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. బీజేపీ నాయకులు జి.రమేష్, యమ్.భారత్‌కుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**నారాయణపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణ పేట పట్టణ కేంద్రంలోని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుండి 12 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో 7 భూ తగాదాలు,3 ఆస్తి వివాదాలు,2 కుటుంబ కలహాలు ఉన్నాయి అన్ని ఫిర్యాదులను తక్షణమే చట్టబద్ధంగా పరిష్కరించాలని సంబంధిత సీఐ ఎస్సైలకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి,న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు.

